నికరాదాయం శాకపోయినా మొత్తం ఆదాయం (గ్రాస్‌యిన్‌కం) సాలుసరి పన్నెండువందలు రావాలంటే రైతుకు మూడెకరాల భూమి వుండాలి. ఇంత భూమి కలిగిన రైతులు యెంతమంది వుంటారో అందరికీ తెలిసినదే.

అంతేకాకుండా ఈ పన్నెండు వందలలో భూమి శిస్తు, ఇతరఖర్చులు పోను మిగిలే నికరాదాయం సాలుసరి వెయ్యికి మించదు.

వ్యవసాయ కూలీల పని సరేసరి. సంవత్సరం పొడుగునా ప్రతీరోజూ కూలి దొరకటం దుర్లభం. దొరికినా రోజుకు రెండు రూపాయలుండటం గగనం.

వీరందరి జీవన వ్యవస్థను గురించి. ఇన్ని ప్రణాళికలు గడిచినా, సరైన ఆలోచన యెవరైనా చేశారా అనే ప్రశ్న వేస్తే సమాధానం పూజ్యం ...

పల్లెటూళ్ళకూ, బస్తీలకు ఖర్చులలో యేమాత్రం వ్యత్యాసంలేదు. ఇళ్ళద్దె ఒక్కటే తేడా. పాలు పెరుగుకూడా పల్లెల్లోనూ, బస్తీలలోమాదిరే కొనుక్కోవాలి. కిరసనాయిలు, యెరువులు, అన్నీ బస్తీ మాదిరిగానే...

ప్రస్తుతం మనం అవలంబిస్తున్న వ్యవసాయ విధానంలో పూర్తిగా మార్పురావాలి.

ముఖ్యంగా రైతుకు వ్యవసాయం 'గిట్టుబాటు' అయిన నాడే భూమిని సేద్యం చెయ్యటంలో అతను అసక్తిచూపిస్తాడు.

ప్రభుత్వం యింతవరకు చేసిన భూసంస్కరణలు ఒకవిధమైన సందిగ్ధ వాతావరణాన్ని సృష్టి చేశాయికూడా. రైతులలో కొనుగోలుశక్తి క్రమంగా నశించిపోతోంది. డబ్బు తిరుగాడటల్లేదు. అందుమూలంగా భూమిమీద రైతు పెట్టగలుగుతున్న పెట్టుబడి నానాటికి దిగనాసిల్లిపోతోంది. ఇదొక వ్యాధి.

ప్రభుత్వం, వ్యవసాయాన్ని కూడా ఓ ప్రధాన పరిశ్రమగా పరిగణించాలి. ఒక భారీ పరిశ్రమమీద పెట్టుబడులను ఖర్చు పెట్టినట్లే వ్యవసాయంమీదకూడా ఖర్చు పెట్టాలి.

రష్యాలాంటి దేశమే తన వ్యవసాయోత్పత్తినిగురించి అంతయిదిగా ఆత్మపరిశీలన చేసుకుంటుంటే మనంమాత్రం యెందుకు వెనకాడాలి ?

ఐ. ఎ. యస్. ఆఫీసర్లను తయారు చేసుకున్నట్లే, ఎగ్రికల్చరల్ ఆఫీసర్లను కూడా తయారు చేసుకుని ప్రతి తాలూకాకు నియోగించి వ్యవసాయోత్పత్తిని ఒక క్రమపద్ధతిలో అభివృద్ధి పరచిననాడే దేశంలో ఆహార సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది. వ్యవసాయాన్ని నమ్ముకున్నవాడికి అందరితోపాటు సరిఅయిన జీవనభృతి కలిగిననాడే, పండుగా ఆహారాన్ని అతనూ పండిస్తాడు

ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న వ్యవసాయ పరిశీలకబృందం ఈ సూచనలనుకూడ గమనిస్తుందని నా ఆశ.

## నెహ్రూ గాంధి

ఇన్నాళ్ళూ శ్రీమతి ఇందిరాగాంధీ. ఇప్పుడు శ్రీమతి ఇందిరా నెహ్రూగాంధి.


అలా ఆవిడ ఈమధ్య ఒక సందర్భంలో సంతకంచేశారు అలాగే ఇకమీద సంతకం చేస్తారట.

కారణం—అది శ్రీ నెహ్రూ తుదికోరిక. తన పేరుకూడా తనవారు ధరించాలని. తనకు కొడుకైనా కూతురైనా మిగిలినది ఒక్క ఇందిరే అని ఆయన వ్యక్తంచేశారుట.

మనుమలు రాజీవ్ సంజీవ్ లుకూడా ఇప్పుడు, రాజీవ్‌నెహ్రూగాంధి, సంజీవ్ నెహ్రూగాంధి.

—ఆనంతం.





# పగటి కలలు


### ముళ్లపూడి వెంకటరమణ

పగటి కలలగురించి రాత్రిపూట కబుర్లేమి టనకండి- చాల మంది రాత్రి కలలకు ముందుగానే వీటిని ఏర్పాటు చేసుకొంటారు. పగటి కలలు కనడానిగ్గాని, వాటినిగురించి వినడానిగ్గాని తీరికా ఓపికా ఉండవు. పగటికలలు మాకలవాటు లేదని బుకాయించకండి. ఒకవేళ నిజంగా లేపోతే అలవాటు చేసుకోండి. ఒంటికి చాలా మంచిది.

ఎందుకంటే, పగటికల అనేది మనిషికి దేవుడిచ్చిన మంచి వరాల్లో ఒకటి. మనసులో పేరుకుపోయిన దురాశలను, నిరాశలను అందీ అందని ఆశలుగా పరిమార్చివేసే మందు మితంగా సేవిస్తే కండకూ గుండెకూ పుష్టినిచ్చే దివ్యౌషధం.

ఇందులో అందం ఉంది. ఆనందం ఉంది. కొన్ని ద్రవ్యాలు ఇచ్చే ఉత్తేజం ఉంది. మరీ గాఢమైన పగటికలలు ఎండమావులవంటివయినా, అంతవేడి వుండదు. అంత నిస్పృహ కలిగించవు. అంత చేదు కాదు. కాని చేదుకూడా కాస్త ఉన్నమాట నిజం. గులాబీని ఆఘ్రాణిస్తూవుంటే ముల్లు సన్నంగా గుచ్చుకుంటుంది. సిగరెట్టు కాలుస్తూ కునుకుతీస్తే చుర్రుమని మేలుకొలుపు పాడుతుంది. అలాగే ప్రతి పగటి కలకీ ఒక మేలుకొలుపు - అలారం టైంపీస్‌లా ఏర్పాటయి వుంటుంది. కానీ పగటి కలకీ తేడా ఒకటి - అది అప్రయత్నంగా కనేది. క్షణంలో సగంలో యుగంనేపనిపించేటంత పెద్ద కల కనచ్చు. ఇది ప్రయత్నపూర్వకంగా ఆరంభించేది. ఎంతసేపు కల వుంటే, అంతసేపూ బుర్ర పనిచేస్తూనే వుండాలి....కావలసిన ముడిసరుకు కోరిక. తీరిక.

కోరిక ఉంటే, తీరిక లేకపోయినా కంటారు చాలామంది. కోరిక కళ్ళు ఎత్తరమైనవి. రోడ్డుమీద నడుస్తున్నా, బస్సులో జనంమధ్య నించున్నా, ఆఫీసులో చివాట్లు తింటున్నా కూడా పగటికల అర్జెంటుగా కనవచ్చు.



గొప్పవాడు, బీదవాడు, బలవంతుడు, అర్భకుడు, మేధావి, మేదకుడు, సమర్థుడు, అసమర్థుడు అన్న భేదం లేకుండా అందరికీ ఉచితప్రవేశం లభించే స్వర్గసీమ పగటికల. ముఖ్యంగా రెండో కోవ మనుషులకు దివ్యౌషధం.

అనునిత్యం, అనుక్షణం ప్రపంచమంతటా కోట్లకొద్దీ పగటికలలు ఉత్పత్తి అవుతూనే వుంటాయి. వాటిలో బద్ధకిస్టులు హోరాహోరిగా పనిచేస్తూ వుంటారు. దురదృష్టవంతులు డెర్బీస్వీప్‌లో ఆరుకోట్ల రూపాయలు.... రూపాయలా డాలర్లా.... డాలర్ ఎన్ని? - ఐదు రూపాయలా .... ఐదార్లు....ప్చ్.... అరుకోట్లు బహుమతి అందుకుంటారు. ఆఫీసు ఉద్యోగులు మానేజర్‌ని విలదీసి అడగాల్సిన నాలుగూ అడిగేసి కడిగేస్తూ వుంటారు. రచయితలు వెయ్యి పడగలు నవలలు, మహాప్రస్థానం గేయాలు, కామేశ్వరరావుగారి వ్యాసాలు అవలీలగా రాసేస్తూ వుంటారు. ఇంజనీర్లు తొలిసారిగా రేడియోలూ, విమానాలూ, టెలివిజన్‌లూ కనిపెడుతూ ఉంటారు. నాగేశ్వరరావులా, సావిత్రిలా, రేలంగిలా నటించి పారేస్తూ వుంటారు. కాముకులు ప్రపంచ సుందరులందరినీ - కలకొకరుచొప్పున - పెళ్ళాడి కాపరాలు చేస్తూ వుంటారు. అన్ని కలలకీ చివర - ఓ గుండుసూదిలాటి నిజం సున్నితంగా గుచ్చుకొని మేల్కొలుపు పాడుతుంది. సన్నటి నిట్టూర్పుతో, అది కల, ఇది ఇల అన్న గ్రహింపుతో కథ ముగుస్తుంది. విషాదాంతం అని తెలిసిగూడా ప్రతి వ్యక్తి మోజుపడి కనేవి, పగటికలలే.... ఆనందబాష్పాలు దుఃఖబాష్పాలు కలపటంలోనే ఆ మాధుర్యం ఉందేమో....

పగటికలలలో తేలిక రకం ఉన్నాయి. అవి కలగాని కలలు. ఇవి టెక్నికలర్‌లా తీర్చిదిద్ది ఉండవు. ఇట్టే చెరిగిపోవు. అవి జీవితాంతం ఆడించి తిప్పలుపెట్టే కలలు.

జీతపు రాళ్ళతో అప్పులన్నీ తీర్చిపారేసి అరువులేకుండా ఇల్లు నడపడం.... అసలది కాదు, జీతంలో ఇకనించి నెలకి పదిరూపాయలు మిగిలేటట్టు చేసుకోవాలనుకోవడం.






క్షౌరశిల్పి ఈసడింపుతో చూసి, మొక్కలిన్ని కత్తిరించే షియర్స్‌తోటి క్షౌరం చేస్తానంటాడని అంతలా జుట్టు పెరక్కుండా పెంద్రాళే వెళ్ళడం. ఈసారి నెలవారైతే సుబ్బరంగా రెస్టు తీసుకోవాలని దురాశపడడం. ఇలాటివే. నూటికి 90 మందిని తిప్పలుపెట్టే వాటిలో నెలవునాటి విశ్రాంతి ఒకటి. నేనెరిగిన కుటుంబరావుగారు ఒకరున్నారు - ప్రసిద్ధ కథకుడు కాదు. ఆయన అసలు కలలు కనరు. కన్నా, హెల్తుబద్ధంగా కని వాటిని తక్షణం సాధ్యముగా పరిమార్చి వేస్తాడు - నే చెప్పేది పెద్దకుటుంబంవున్న రావుగారి గురించి.

వాట్ సార్ ఏమిటండీ ఈ లైఫు. ఏమిటంట. పొద్దున్న లేచింది లగాయతూ ఎవడో తరుముతున్నట్టు మొహం కడుక్కోడం, కాఫీతాగడం, పేపరు చూడ్డం, తినడం, జీను వేసుకుని వంగెత్తడం, పరిగెడుతూ పనులు చెయ్యడం, ఇల్లు చేరడం, తరుముతున్నట్టే తినడం, పక్రీసు, ఛఛ.... రన్నింగురేసులా వుంది. బొత్తిగా రెస్టుండటం లేదు ఈ కాలపు మానవుడికి. అంటాడాయన ఎవరో తరుముతున్నట్టు, అని వెళ్ళిపోతాడు. ఒక్కక్షణం అగాడా ... ఒక అరనిముషంసేపు ఆయన ముఖం ప్రసన్నంగా ఉంటుంది. కళ్ళు అరమోడ్చి తనలోతను చిరునవ్వు నవ్వుకుంటాడు.

ప్చ్ ... ఈసారి... రేపు నెలవునాడు ఏమైనాసరే పూర్తిగా రెస్టు తీసుకుతీరతాను, అంటాడు - మనం ఒద్దన్నట్టు. ఆ అరనిముషం ఆయన ఎవరో తరుముతున్నట్టే ఒక పగటికల కంటాడన్నమాట.

"నెలవునాడు రెస్టంటే ఏలాగని మీ ఉద్దేశ్యం" అని అడిగాను. చెప్పమంటారా? అంటాడాయన హుషారుగా. చెప్పడంలోనే అనుభవించినంత ఆనందం కనపిస్తుందాయన ధోరణిలో.

ఆ పవిత్రదినాన ఆయన రోజూలాగా ఆరింటికి లేవడు. ఎనిమిదిన్నరకి బద్ధకంగా కళ్ళు తెరుస్తాడు. తెరిచాక మళ్ళీ మూస్తూ, తెరుస్తూ ఆలోచిస్తూ బద్ధకంగా



ఓ అరగంటసేపు అలాగే పడుకుంటాడు. తొమ్మిదింటికి, మానేజరుగారి పెద్దబ్బాయిలా బెడ్ కాఫీ తాగుతాడు తరవాత పళ్ళుతోమి, టిఫిను తిని, సంచి పట్టుకుని కూరలమార్కెట్టుకు వెళ్తాడు. దారిలో వాళ్ళతో-వీళ్ళతో పిచ్చాపాటి చెప్పి కూరలు తీసుకుని ఇంటికి వస్తాడు. పదకొండున్నరదాకా వంటింట్లో కూర్చుని పెళ్ళాంతో కబుర్లాడుతూ కూరలు స్వయంగా తరుగుతాడు. వీలైతే కొన్నిటిని తనే పోపేస్తాడు ఈలోగా శ్రీనించి మంగళం వరకూ పేపరు సావకాశంగా చదువుకుంటాడు. పన్నెండింటికి భోంచేసి, హాయిగా పడకేస్తే నా సామిరంగా. ఇంకా చాలా వున్నాయి అలాటి కలలు. సాయంత్రం టిఫిను, క్లబ్బు. లేదా గుడి, బైస్కోపు....

మొన్నటి వారంనాడు అవిధంగా చెయ్యాలని శనివారం సాయంత్రం సుస్నాతుడై సంకల్పించాడు. పగటికలలు పండినవాడిని గాబట్టి ఈయనదేమాత్రం పండుతుందో చూదామని, ఆరింటికే వెళ్ళి వాళ్ళింటి సావిట్లో కూర్చున్నా....

ఆనాడు ఆయనకి రివాజయిన ప్రకారం ఆరున్నరకే తెలివొచ్చింది. లేచి సావిట్లో కొచ్చి కటుక్కున నాలిక్కరుచుకున్నాడు. ఎనిమిదిన్నరదాకా లేవకూడదనుకున్నాడు గాని వెధవది అలారంపీసులా అలవాటైపోయింది. పైగా-పెరట్లోదాసీది, గుమ్మంలో పాలవాడు. సావిట్లో పిల్లలు ఎలక్షన్‌లో ఉపన్యాసకుడి కంఠాలా గొంతెత్తి మాట్లాడుకుంటున్నారు.

అమ్మని కాఫీ తెమ్మనా .... అన్నాడు కుర్రాడిలా.

మొహం కడుక్కోవా నాన్నా అన్నాడు వాడు.

కాఫీ తెమ్మంటే ... అన్నాడాయన.

ఆవిడవచ్చింది. విధూరంగాకపోతేపాచి మొహంతో కాఫీయా... లెండిలెండి అంది.




అమ్మా కాఫీగిన్నె వేస్తారా, అల్ల వారింటికెళ్ళిరానా. అంటుంది పెరట్లో పనిమనిషి.

లేవండీ అది వెళ్ళిపోతుందట. పోతే మళ్ళీ నే తోముకుచావాలి. అంది ఇల్లాలు. కుటుంబరావుగారు పెరట్లోకి పరిగెత్తారు.

అరగంట తరవాత మార్కెట్టులో కూరలు కొనబోయారాయన. బోలెడు కూరలు కొని, హాయిగా తిరిగ్గా అన్నీ తరగాలని లెక్కలువేస్తూ వచ్చిన పెద్దమనిషికి వంకాయ రూపాయండి, దొండకాయ రూపాయపావలా అంటూ ధరల దండకం చదివేసరికి ఉషారు చల్లారిపోయింది. రెండ్రూపాయల కూరలు కొంటేగాని అరగంట తరిగిన సరదా తీరేట్లా కనబడదే.

ఆయన ముఖంచూస్తే ఆయన కల ఎప్పుడు ఆరంభమైందో మీక్కూడా తెలిసిపోతుంది. చూస్తూవుండగానే ఆయన చూపులో ఒకరకం శూన్యత కనిపిస్తుంది. కోపంమీద కలగంటున్నపుడు ముక్కుపుటాలు పూరిస్తాడు. గడ్డం కొనదేరుతుంది. పిడికిళ్ళు వాటంతటవే కాస్త బిగుసుకుంటాయి. ఇంకోపదిక్షణాలకల్లా ముఖంలో ఎరుపుదిగుతుంది. బిగించుకున్న నరాలు సడలుతాయి. ముఖంలో ప్రసన్నత వెన్నెలలా కాస్తుంది ఉండుండి చిరునవ్వులు పూస్తాయి. అంటే అర్థం-కోపంకొద్దీ మినిస్టరయిన కుటుంబరావుగారు - మంత్రికాగానే మండుతున్న ధరంమాట మరిచిపోయి పరండా అంత కారులో వెనుకసీటులో కూర్చొని వెళ్తున్నా డన్నమాట. సన్మాన




ఏవిటీ ధరలిలా మండిపోతున్నాయి సభలో [illegible] దండ వేయించుకుంటున్నాడన్నమాట. బాదంహల్వా చలిమిడిముద్ద అంత పుచ్చకోడమేకాక పిల్లలికి పొట్లాలు కట్టించి పంపిస్తున్నా డన్నమాట. పూలదండలన్నీ తుంచి ఆవిడగారిమీద పూలవాన కురిపిస్తున్నా డన్నమాట. ఇవన్నీ ఆయన ముఖకవళికలో మనం సునాయాసంగా చదువుకోవచ్చు.

అని మండిపడుతూ కాసిని కూరలు కొని ఇంటికి బయల్దేరాడు.

వీళ్ళందరికి పొగరణచాలంటే ఇలా కాదూ....అసలూ....నెమ్మదిగా ఆయన పగటికలల స్వర్గసీమలోకి జారిపోయాడు. అందులో ఆయన ప్రధానమంత్రి, ధరలు పెంచితే డొక్క చీరేస్తానని రూల్సు వేయించి. ప్రజలని కాపాడాలన్న పట్టుదలతో అదే ఎలక్షను ప్లాటుఫారంగా ఎన్నికై. మెంబరై మంత్రయ్యాడు....

కుటుంబరావుగారి పగటికల వయినాలనీ కేం తెలుసునని మీరడక్కండి

ధరల మంటలు చల్లార్చే కలలో పడుస్తున్న కుటుంబరావుగారి కాలికి. ఇలలో ఆంధ్రారోడ్డుమీద కంకర్రాయి ఒకటి తక్కున తగిలింది. తక్షణం ఆయన మంత్రి పదవి త్యాగంచేసి అమ్మబాబోయ్ అన్నాడు. ధరలకన్న ఎక్కువగా ఒళ్ళుమండిం దాయ






వకీ. తక్షణం, కాలికి మందేనావేసుకోకుండా పి. డబ్ల్యు. డి శాఖలో మంత్రి అయి, రహదార్లశాఖ పని పట్టించడం మొదలుపెట్టాడు. ఆయన ముఖంలో కర్కశత్వం. ఆ పళ్ళు గిట్టకరుచుకోవడం చూస్తే ఆయన సెక్రటరీలచేత, రోడ్డు కంట్రాక్టర్లచేత రోడ్లమీద రాళ్ళేరించి చదును చేయిస్తున్నాడనిపించింది.

రెండు తీవ్రమైన కలలు కని ఇంటి కొచ్చేసరికి ఆయనకి ప్రాణం చాలొచ్చింది. కూరలు నువ్వే ఏడూ అని భార్యకు సూచించి, మంచినీళ్ళు తాగి అరుగుమీద కూర్చొని అప్పుడే వచ్చిన ఆదివారం పత్రిక విప్పాడాయన.


తరవాత అరగంటవరకూ చూపు పేపరు మీద ఉన్నా, మనసు పక్క పెద్దమనిషి జబర్దస్తీమీద ఉంది.

రెస్టు తీసుకుంటున్నారా? అన్నాను వెళ్ళి.

నా బొంద. . అన్నాడు ముక్తసరిగా.

బహుశా ఆయన కల్చరల్ మినిస్టరయి, ప్రజలకి పేపరుకొనే అలవాట్లు, పక్కవాడిది లాక్కోకుండా ఉండే నిగ్రహం మప్పుతున్నాడనుకున్నాను.

హడావుడిలో టిఫిను ప్రోగ్రాం మరిచిపోయినందువల్ల కోపంతోటే ఆకలి చుర్రుమంది. ఆదివారంకదా అని దేవుడిపాటలు



కొస్త అందులో కథలూ వ్యాసాల సెక్షనిలా పారెయ్యండి అంటూ ఒక చెయ్యి వచ్చి పేపరు లాక్కుని కావలసింది తీసుకుని మిగతా కాయితాలు ఆయనముందు పడేసింది. కుటుంబరావుగారు ఆపాదమస్తకం కోపంతో, ఉక్రోషంతో వణికిపోయాడు.

పాడుతూ సావకాశం మడికట్టుకున్న ఇల్లాలుమీదకు తిరిగిందదంతా. ఆదివారం నాడయినా స్తిమితంగా తిని పడుక్కునే యోగం లేదు. అంటూ లేచాడాయన.

ఆవిడ నీళ్ళకడవ దింపింది.

తొంగిచూసి నవ్వుతుంటున్న పిల్లలికి రెండువేసి. వెళ్ళగొట్టి ఇల్లాలును బ్రతిమాలాడాయన. ఇపుడు నేనేమన్నానే - అంటూ.


అవిడ కోపం తగ్గినందువల్లనో, అన్నం మాడువాసన వచ్చినందువల్లనో మొత్తానికి అవిడ గుమ్మంమీంచి లేచింది.

భోజనం అయి అమ్మయ్యా అనేసరికి ఆఫీసరుగారి జవాను కబురుతెచ్చాడు- ఆయాసపడుతూ. అదెంత పనో అని వెళ్ళిన వాడికి ఆయన నడ్డివిరిగే పని చెప్పాడు. పిల్లలకి మ్యాపులు వేసిపెట్టాలయ్యా గొడవ పెడుతున్నారు-అంటూ అటు తిరిగి పడుకున్నా డాఫీసరుగారు.

ప్రపంచంలో విద్యావిధానాన్ని రద్దుచేస్తూ, సంతాన నియంత్రణం కఠినంచేస్తూ ఓ పగటి కల కని, పని పూర్తిచేసి నాలుగింటి కింటికి చేరిన కుటుంబరావుగారు వాలుకుర్చీలో రామచంద్రా అంటూ వాలిపోయారు.

ఈసారి సెలవునాడు పూర్తి రెస్టు తీసుకోవాలండీ అన్నారు ఎదురుగా లేని నాతో. పదిహేనేళ్ళగా నడుస్తోందాయన కల. ఇంకా ఫలించలేదు. నా కొకటే మార్గం తోచింది. ఈసారి సెలవునాడు పదినిమిషాలు తీరిక చేసుకుని-ఒక సెలవునాడు పూర్తిగా రెస్టు తీసుకున్నట్టు ఒక టెక్నికలర్ పగటికల కనిపారెయ్యడం మంచిది అని. 000

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)







# ఆశించని ఆనందం

లోపల్నుంచి తెరలు తెరలుగా వచ్చే బాధతో మెలితిరిగిపోతున్నది నాగరత్నం. ఆగలేక ఒకోక్కసారి "అమ్మా!" అని అరుస్తున్నది గట్టిగా. తలంతా చిందర వందరగా రేగి, ముంగురులు ముఖాన్ని కప్పడానికి ప్రయత్నిస్తున్నాయి. వచ్చటి నుదుటిమీద నల్లటి ముంగురులు, వింత అందాన్ని తెస్తుండే కూతురివైపే చూస్తున్నది చిట్టెమ్మగారు.

"అమ్మాయిగారికి కాస్త వేడి వేడి కాఫీ యివ్వండమ్మా. కడుపులో కాస్త వేడి నీళ్లు పడ్డాయంటే ప్రాణ వస్తుంది" అన్నది మంత్రసాని మాలక్ష్మి. అమ్మాయిగారి పేరుతో తన గొంతుకూడా తడుస్తుంది కదా అన్న ఆశతో.